క్లుప్తంగా

ఘనంగా సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు



కారెంపూడి: సినీ నటుడు సూపర్ స్టార్ ప్రిన్స్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు గణితం అమరయ్య మాట్లాడుతూ చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించిన మహోన్నత మైన వ్యక్తి మహేష్ బాబు అన్నారు. తొలుత జన్మదిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, నందమూరి బాలకృష్ణ ఫ్యాన్సు అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, నాగేశ్వర రావు, నన్నేసా, కె.పేరయ్య పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడాలి



కారెంపూడి: ప్రతి ఒక్కరూ వారి హక్కుల సాధనకై పోరాడాలని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు అన్నారు. స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో అల్లూరి సీతారామ రాజు, బిర్సా ముండా చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసిల చరిత్ర హక్కులు గురించి వివరించారు.

లక్ష్మీ గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



రెంటచింతల: మండలంలోని మంచికల్లులో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ నిర్మాణానికి శనివారం అర్చకులు జిగురు చంద్రశేఖర్ శర్మ, ఎస్.వంశీ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో కాశిబోయిన రామ్మూర్తి, ధన లక్ష్మి దంపతులు భూమిపూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ ఐదు సెంట్ల స్థలంలో సుమారు రూ.35 లక్షలతో ఈ ఆలయాన్ని గ్రానైట్ రాయితో నిర్మించనున్నట్లు తెలిపారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఆలయ నిర్మాణంలో తమ వంతు సహాయ సహకారం అందించాలని కోరారు.

బైబిల్ క్విజ్ విజేతలకు బహుమతులు ప్రదానం



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో పల్నాడు బైబిల్ డిజిటల్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైబిల్ క్విజ్‌పోటీలలోని విజేతలకు శనివారం బహుమతులను దైవ సేవకుల చేతులమీదుగా అందజేశారు. పోటీల కన్వీనర్ శంకర్ మాట్లాడుతూ మాచర్ల పట్టణానికి చెందిన జ్యోతిర్మయి బృందానికి మొదటి బహుమతి, లేమన్స్ ఫెలోషిప్ చర్చికి చెందిన కరుణ గ్రూపునకు ద్వితీయ బహుమతి, లోకేష్ జట్టుకు తృతీయ బహుమతి పొందినట్లు చెప్పారు. అనేక ప్రాంతల నుంచి పెద్ద సంఖ్యలో వయోభేదం లేకుండా ఈ పోటీలలో పాల్గొనడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో స్థానిక దైవసేవకులు మోహన్, ప్రసాద్, యోహోషువ, పోటీలు నిర్వహక కమిటీ సభ్యులు చంద్రయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



పిడుగురాళ్లరూరల్: మండలంలోని మెడికల్ కాలేజీ వద్ద ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కామేపల్లిలోని మెడికల్ కాలేజీ వద్ద 30 ఏళ్ల వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికుల సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ మోహన్ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు సీఐ వెంకట్రావు 9440796236, ఎస్ఐ మోహన్ 7207271178 నెంబర్‌లకు ఫోన్ చేయాలని కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలు



అభయ ఆంజనేయస్వామి, బుడియా బాపు స్వామి వార్ల ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు



శ్రీ అభయ ఆంజనేయస్వామి, బుడియా బాపు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రెంటచింతల: స్థానిక అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి, బుడియా బాపు స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం, యంత్రస్థాపన, కుంభాభిషేకం, గోపూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య ఉదయం 7.48 గంటలకు అర్చకులు గోపాల్‌పాండే నేతృత్వంలో చింతపల్లి మణిశర్మ ఆధ్వర్యంలో మండప పూజలు, విగ్రహ అభిషేకాలు, అంగన్యాసాలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ ప్రతిష్ఠామహోత్సవంలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకలలో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు మహాన్నదానం చేపట్టారు. ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి

సత్తెనపల్లి: డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని ముఖ్యంగా కాలేయం,మెదడు, గుండె వంటి ప్రధాన అవయవాలు రోగగ్రస్తమవుతాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యపానం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి సత్తెనపల్లి టౌన్ లోని మాస్టిన్‌పేటలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మద్యపానం వల్ల ఆర్థికంగా చితికి పోవడంతో పాటు శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి జీవితం నరకప్రాయం అవుతుందని తెలిపారు. గంజాయి వంటి డ్రగ్స్ సంబంధిత నేరాల్లో గరిష్టంగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి ఎస్ఐ నాగలక్ష్మి, కానిస్టేబుళ్లు కోటయ్య, హనుమ, ఆనంద్, శివ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

రెంటాల(రెంటచింతల): క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని బీజేపీ నాయకుడు ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. సొంత గ్రామానికి తనవంతుగా సొంత నిధులు రూ.70 వేలు వెచ్చించి గోడ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గురజాల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఏఎం ధర్మేంద్ర చారి సూచించారు. స్థానిక వికలాంగుల కాలనీలో శుక్రవారం జ్వర పీడితులను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని చెప్పారు. ఎవరైనా జ్వరం బారిన పడి ఇబ్బందులు పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కాలనీలో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు తెలుసుకుని పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

సత్తెనపల్లి: మంటలు వ్యాపించి ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని రెంటపాళ్ల-కొంపెర్లపాడు గ్రామాల మధ్యలో శనివారం జరిగింది. కృష్ణమూర్తి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శబ్దం వచ్చింది. దీంతో నిలిపి చూసేలోగా మంటలు వ్యాపించాయి. ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

సీపీఐ జిల్లా సమితిలో సత్తెనపల్లి నుంచి ముగ్గురికి స్థానం

సత్తెనపల్లి: సీపీఐ జిల్లా సమితిలో సత్తెనపల్లి వాసులకు ముగ్గురికి చోటు లభించింది. పట్టణానికి చెందిన ముసునూరి రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కంబాల శ్రీనివాస్, వల్లెం లక్ష్మీచెన్నకేశవరావును జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వినుకొండలో జరిగిన రెండో మహాసభలో ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన నేలపాటి మనోహర్ (24) అమరావతిలోని ఓ మిఠాయి దుకాణంలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మేస్త్రి వద్ద ద్విచక్ర వాహనం తీసుకొని గుడిపూడి నుంచి పెదమక్కెన గ్రామానికి వెళ్లే క్రమంలో కల్వర్టును ఢీకొట్టి పొలాల్లో పడిపోయాడు. శనివారం ఉదయం స్థానికులు చూసి మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి చంద్రరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని సత్తెనపల్లి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నాదెండ్లలో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శ్రీ గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ శనివారం తెలిపారు. తనతో పాటు న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి వైద్య చికిత్సలకు సిఫార్సు చేస్తామన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యతోనే అసమానతలు రూపుమాపు

సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు



వసతి గృహంలో మాట్లాడుతున్న డీఎస్పీ

సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజంలో అసమానతలు రూపుమాపవచ్చునని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు అన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం 'రక్షక భటులతో రక్షా బంధన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ హనుమంతురావు మాట్లాడుతూ విద్యార్థినులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలోనే కష్టపడితే మంచి ప్రయోజకులు అవుతారని, అప్పుడే కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల చెమట చుక్కలకు విలువ వస్తుందని చెప్పారు. నేటి విద్యార్థులంతా సెల్‌ఫోన్‌లతో ఎక్కువ సమయాన్ని వృథా చేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల శ్రమను దృష్టిలో ఉంచుకొని అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థినులంతా చదువు మీదే దృష్టి ఉంచాలని, రక్షణను పోలీసులు చూసుకుంటారని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వచ్చిన ఆరు నెలల్లోనే వసతి గృహంలో అద్భుతమైన మార్పులు తీసుకొచ్చినందుకు వార్డెన్ సుమణిని ఆయన అభినందించారు. పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఏ ఆపద వచ్చినా పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. మదర్ థెరిస్సా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ చిలకా జాన్సన్ మాట్లాడుతూ హాస్టల్ సుందరీకరణకు తమ సంస్థ ద్వారా మొక్కలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు తమ సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. ముందుగా వసతి గృహ ప్రాంగణంలో డీఎస్పీ హనుమంతరావు, సీఐ నాగమల్లేశ్వరరావు కొబ్బరి మొక్కలను నాటారు. హాస్టల్ వార్డెన్ పాలెపోగు సుమణి డీఎస్పీ హనుమంతరావుకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. పలువురు విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ యష్నా, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డా క్షేమం



అమరావతిలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రవికుమార్, సుబ్బారావు

పెదకూరపాడు: గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని 75 తాళ్లూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. రెండో శనివారం నేపథ్యంలో పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పోషకాహారాన్ని అందజేశారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ వైద్యులు సూచించిన మాత్రలతోపాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్ పాల్గొన్నారు.

అమరావతిలో..

పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరుకు చెందిన బెజ్జం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆడిట్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.వి. సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు అదృష్టవంతులని, మరో బిడ్డకు జన్మనిచ్చే భాగ్యం వారికి దేవుడిచ్చిన వరమని తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వైద్యుల సూచనలను పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోజన చైతన్య సమితి ప్రతినిధి మేకల శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.మహేశ్వరి పాల్గొన్నారు.

అనుపాలెం సొసైటీ చైర్మన్‌గా తోట నర్సయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా తోట నరసయ్య , మెంబర్లుగా నానబాల నరసింహారావు, నల్లగొర్ల శివకుమారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేనా జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమన్నారు. కొత్తగా నియమితులైన ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న జిల్లా, నియోజకవర్గ, మండల కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా అంచులవారిపాలెం గ్రామ శివారు అంబేడ్కర్ గిరిజన గూడెంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గూడెంను సందర్శించి, కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సరోజిని పాల్గొన్నారు.

యువకుడికి పాముకాటు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామానికి చెందిన బండి లక్ష్మీనారాయణ అనే యువకుడు శనివారం పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసముండే లక్ష్మీనారాయణ ఇంటి పక్కనే గడ్డిమోపు తీసే క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు సత్తెనపల్లిలోని వైద్యశాలకు తరలించారు. లక్ష్మీనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని స్థానికులు తెలిపారు.

అన్నప్ప సేవలు ఆదర్శనీయం

పెదకూరపాడు: హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ అవ్వారి చిన్న అన్నప్ప సేవలు ఆదర్శనీయమని భావన రుషి ఆలయ కమిటీ అధ్యక్షులు అనుముల వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని లగడపాడులో శనివారం భద్రావతి సమేత భావన రుషి దేవాలయ నిర్మాణాన్ని అన్నప్ప దంపతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో పలువురు పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సహాయం అందించిన మంచి వ్యక్తి చిన్న అన్నప్ప అని కొనియాడారు. దేవాలయాలకు కూడా పెద్దఎత్తున భారీ విరాళాలు అందించారని తెలిపారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



పాలువాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి

రెంటచింతల: పత్తిలో సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని పాలువాయి గ్రామంలో పత్తి పంట సాగుచేస్తున్న పొలాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలలో పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగు కనిపిస్తుందని చెప్పారు. నివారణకు ఫ్రిప్రోనిల్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి , లేదా 1.5 గ్రాముల లెసిఫేట్‌ను ఒక లీటర్ నీటికి, లేదా కాన్ఫిడార్ 0.4 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. 50 నుంచి 60 రోజుల పత్తిపంటలో ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టలో 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరుసగా పడిన 10 పత్తి పువ్వులకు ఒక గుడ్డి పువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా లార్విన్ 1.2 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్ ఒకలీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు. గూడ, పూల రాలకుండా 60 రోజులు నుంచి 90 రోజులు పత్తి పంటకు ఒకసారి 1.5 గా. బొరాక్స్‌పొడిని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకుని నివారించవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంక్‌శాఖ ద్వారా బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో, మీ– సేవా, రైతు సేవాకేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేసుకోవాలని, ఆగస్టు 14వ తేదీ వరకు పంటల బీమా చేయించుకోవడానికి అవకాశం ఉందని వివరించారు. ఎకరా పత్తికి రూ.1900, మిరపకు రూ. 360, వరికి రూ.80, కందికి రూ.40 ప్రీమియం చెల్లించాలన్నారు.

సుస్థిర వ్యవసాయంతో ఆర్థిక పరిపుష్టి



అవగాహన కల్పిస్తున్న శ్యామ్ సుందర్ రెడ్డి

పెదకూరపాడు: సుస్థిర వ్యవసాయంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని రిటైర్డ్ ఏడీఏ బి.శ్యామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని 75త్యాళ్ళూరులో శనివారం నీలగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మిర్చి పంట– సుస్థిర వ్యవసాయం'పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల సమయంలో సూక్ష్మపోషకాలు పని చేయవని తెలిపారు. ప్రతి ఏడాది ఒకే ప్రదేశంలో మిర్చి నారుమళ్లు నాటరాదని, ఎత్తు నారుమళ్లు మంచిదని సూచించారు. నర్సరీ పద్ధతిలో మిర్చి నారు పెంపకం గురించి వివరించారు. నీలగిరి ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ రత్తయ్య తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధానాన్ని వివరించారు. సాగులో విత్తనం, మొక్క నాటడం, కలుపు తీయడం, కాయ కోయడం, తాలు ఏరడం వరకు మహిళల పాత్ర ఎక్కువని, వ్యవసాయ శిక్షణ కార్యక్రమాల్లో వారు కూడా పాల్గొనాలని ఆయన తెలిపారు. నవరత్న పచ్చిరొట్ట సాగు ఉపయోగాల గురించి వివరించారు. ఎలక్ట్రిక్ ట్రాక్టర్ గురించి డీఎం మారుతి వివరించారు. మోనో గ్రోమోర్ ద్వారా రైతులకు అందించే ఉత్పత్తుల గురించి మేనేజర్ బాజీ, ఇంచార్జి శ్రీనివాస్ వివరించారు. జీవామృతం, పశువుల ఎరువులు, డ్రిప్ గురించి ప్రకృతి వ్యవసాయ రైతు గుత్తికొండ కోటిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక ప్రేమికుల దినోత్సవం



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో శనివారం జనవిజ్ఞానవేదిక, షేక్ లాలూ దాదాసాహెబ్ సేవా సమితి సంయుక్తంగా అంతర్జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, పుస్తకాలను చదవడం ఎలా జీవితం మార్చగలదో విద్యార్థులకు వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు గొప్ప వ్యక్తుల పుస్తకాలను చదివే అవసరాన్ని ఉద్ఘాటించి, ప్రపంచాన్ని మార్చినది పుస్తకాలు అని ఉదాహరణలతో స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు జేవీవీ ప్రచురించిన కథల పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. సభకు వైఎంసీఏ జిల్లా అధ్యక్షుడు చుక్కా విన్సెంట్‌పాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆర్యవైశ్య కళ్యాణ మంటపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, మస్తాన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శోభన్‌బాబు, వెనుక నిందితులు

వినుకొండ: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగలను వినుకొండ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసి మీడియా ప్రవేశపెట్టారు. వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలో గత నెల 31వ తేదీన రాయని మస్తానయ్య ఇంటిలో దొంగలు పడి 139 గ్రాముల బంగారం దోచుకెళ్లారు. వినుకొండ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శోభన్‌బాబు ఆధ్వర్యంలో కేసులో నిందితులైన పెంద్రాల సముద్రాలు, చిన్నసముద్రాలు, శ్రీనులను వినుకొండ మార్కెట్ యార్డు సమీపంలో పట్టుకుని వారివద్దనుంచి బంగారం రికవరీ చేశారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన ఎస్ఐలు సీమర్‌బాష, స్వర్ణలత, కానిస్టేబుళ్లు తిరుమలరావు, బాలవెంకటేశ్వర్లు, తిరుమల నాయక్, హోంగార్డులు అజ్గర్, కె.శ్రీనివాసరావులను సీఐ అభినందించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిఖా శ్యాంసన్

క్రోసూరు: గత రెండు సంవత్సరాలుగా పేరుకుపోయిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు శిఖా శాంసన్ కోరారు. క్రోసూరు పీహెచ్‌సీ సమావేశపు గదిలో శనివారం 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో శాంసన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం నూతన విధానాన్ని అవలంబించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లింపునకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల పక్షపాతిగా, సహృదయంతో తమకు మేలు చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కామేశ్వరి, లక్ష్మి, రత్తయ్య, శివుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు

సత్తెనపల్లి: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీదేవికి శనివారం రాత్రి జాజి పూలు, మల్లెపూలతో భక్తిశ్రద్ధలతో పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను పాలకవర్గం, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.